# రావణ దహన వేడుకలకు పటిష్ట భద్రత



మెయిన్‌లో

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
మంగళవారం | 20 ఆక్టోబరు, 2026 | పేజీలు : 06

# ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

### అర్జీలు స్వీకరించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల:** ప్రజావాణికి 35 ధరఖాస్తులు వచ్చాయి. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించి ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అర్జీలు స్వీకరించారు. మొత్తం 35 అర్జీలు రాగా సంబంధిత అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు. సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయం, వేములవాడ ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ధరఖాస్తులు రాలేదు.

**జిల్లాలోని అన్ని మండలాల్లోని ఎంపిడివో కార్యాలయాల్లో :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని అన్ని మండలాల్లోని ఎంపిడివో కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వకు ప్రజావాణి ఎంపిడివోలు నిర్వహించి ప్రజల నుంచి వివిధ మండలాల్లో 16 ధరఖాస్తులు స్వీకరించారు. మండల, డివిజన్ స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంతోపాటు సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాలు, అన్ని ఎంపిడివో కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా రెవెన్యూ డివిజన్ల కార్యాలయాలు, ఎంపిడివో కార్యాలయాల్లో ప్రజావాణి కొనసాగుతుందని స్థానిక ప్రజలు తమ అర్జీలు అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అన్ని చోట్ల అప్లికేషన్లు ఆన్లైన్ చేస్తారని పేర్కొన్నారు. ఈఐడీఓసీ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేశ్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.



## విజయదశమి అందరికీ
# విజయాలు చేకూర్చాలి



### జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయుధ, వాహన పూజలు: ఎస్పి అశోక్ కుమార్

**ప్రజాపక్షం/జగిత్యాల:** విజయదశమి పండుగ ప్రజలకు అన్ని రంగాలలో విజయం చేకూర్చాలని ఎస్పీ అశోక్ కుమార్ ఆకాంక్షించారు.జిల్లా పోలీసు కార్యాలయంలోని ఆర్ముడు రిజర్వ్ విభాగంలో ఆయుధ పూజ,వాహన పూజ ను ఎస్పీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ దుర్గా దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.విజయదశమి పర్వదినోత్సవం అందరికి సుఖ సంతోషాలు కలిగించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు మరియు పోలీస్ అధికారులకు సిబ్బందికి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ పూజా కార్యక్రమాలలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్,డిఎస్పీ లు పురుషోత్తం రెడ్డి, రవికుమార్, ఇన్స్పెక్టర్లు వేణు,ఆరిఫ్ అలీ ఖాన్,కరుణాకర్,శ్రీనివాస్,తదితరులు ఉన్నారు.

## కమిషనరేట్ కేంద్రంలో
# ఘనంగా దసరా వేడుకలు

### ఆయుధ, జమ్మి, వాహన పూజల్లో పాల్గొన్న సిపి గౌష్ ఆలం

**ప్రజాపక్షం/కొత్తపల్లి :** కమీషనరేట్ కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో సోమవారం దసరా పండుగ సందర్భంగా నిర్వహించిన ఆయుధ, జమ్మి, వాహన పూజా కార్యక్రమాల్లో కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ కమీషనరేట్ ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కమీషనరేట్ ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో దసరా పండుగ జరుపుకోవాలని, సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని సీపీ గౌష్ ఆలం ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు జానీమియా, శ్రీధర్ రెడ్డి, కిరణ్ కుమార్ లతోపాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# వైభవంగా దుర్గామాత కుంకుమ పూజలు

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం ఖమ్మంపల్లి గ్రామంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా సాగుతున్నాయి.ఉత్సవాల్లో భాగంగా సోమవారం గ్రామ లీడర్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో దుర్గాదేవి సన్నిధిలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని సామూహిక కుంకుమ పూజ కార్యక్రమాన్ని అత్యంత భక్తిభావంతో నిర్వహించారు.ఈ వేడుకలతో ఖమ్మంపల్లి గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ నవరాత్రుల పర్వదినాల్లో గ్రామంలో దుర్గామాత ఉత్సవాలు నిర్వహించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.అమ్మవారి కృపతో గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని,గ్రామం అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. భక్తిభావంతో నిర్వహించిన ఈ బోనాల వేడుకలు గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపగా,దుర్గామాత ఆశీస్సులతో ఖమ్మంపల్లి గ్రామం సుభిక్షంగా ఉండాలని భక్తులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో లీడర్ యూత్ సభ్యులు,గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## టియుసిఐ సదస్సును జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/అంతర్గాం :** గోదావరిఖనిలో నవంబర్ 1న నిర్వహించనున్న టియూసిఐ పెద్దపల్లి జిల్లా సదస్సును జయప్రదం చేయాలని టియూసిఐ జిల్లా నాయకుడు గొల్లపల్లి చంద్రయ్య పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా అంతర్గాం మండల కేంద్రంలో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.చంద్రయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కార్మిక చట్టాలతో కార్మికుల హక్కులకు భంగం కలుగుతోందని,పని భారం పెరుగుతున్నా ఉద్యోగ భద్రత లేకుండా పోతోందని విమర్శించారు. జీవోల ప్రకారం వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, సింగరేణి సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులతోపాటు బసంత్‌నగర్ భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, న్యాయమైన వేతనాలు,ఉద్యోగ భద్రత, మెరుగైన పని పరిస్థితులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై చర్చించి,హక్కుల సాధనకు భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడమే జిల్లా సదస్సు ప్రధాన ఉద్దేశమని తెలిపారు.ఈ సదస్సుకు టియూసిఐ రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర నాయకులతో పాటు సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా జిల్లా నాయకులు హాజరవుతారని వెల్లడించారు.కార్మికులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర నాయకుడు భూసనవేణి కృష్ణ,జిల్లా నాయకులు ఆడెపు శంకర్,గుమ్మడి వెంకన్న,గంగాధరి తిరుపతి,రమేష్,సాయిలు పాల్గొన్నారు.

## వైభవంగా దుర్గాదేవి పూజలు

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామంలో లీడర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా సాగుతున్నాయి.ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు సోమవారం అమ్మవారు భక్తులకు శ్రీ మహిషాసురమర్ధిని దేవి అవతారంలో దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు,విశేష అర్చనలు నిర్వహించారు.అదేవిధంగా మండలంలోని కేషన్ పల్లి దుర్గామాత మండపం వద్ద మాజీ సర్పంచ్ నూనె కుమార్,మాజీ ఉప సర్పంచ్ తాత స్వప్నబాలు,మాజీ వార్డు సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు భారీగా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ అన్నదాన కార్యక్రమంలో దుర్గామాత భక్తులు,గ్రామ ప్రజలు,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.నవరాత్రి ఉత్సవాల ముగింపు సందడితో గ్రామాలన్నీ ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతున్నాయి.

## అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని* కలెక్టరేట్ పరిపాలన అధికారి బండి.ప్రకాష్ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్, కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.ఎలిగేడు మండలం శివపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ చాంద్ బి వృద్ధాప్యంలో తన కుమారులు,కూతురు తన బాగోగులు చూసుకోవడం లేదని దరఖాస్తు చేసుకోగా సంక్షేమ శాఖ(ఎఫ్ఆర్వో )అధికారి కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.రామగుండం మండలం గోదావరిఖని జిఎం కాలనీకి చెందిన కొమ్మ చందు యాదవ్ కోర్టు కేసులో ఉన్న ఇంటి నెంబర్ 71 166/1 పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని జంగిలి రాజిరెడ్డి అక్రమ పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని దరఖాస్తు చేసుకోగా తాసిల్దార్ రామగుండం కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని ఏవో తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో పిడి హౌసింగ్ పవన్ కుమార్ అధికారి బి. ప్రకాష్,ఈ సెక్షన్ పర్యవేక్షకులు విజయ్, సి సెక్షన్ పర్యవేక్షకులు కోటేశ్వర్,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి శ్రీధర్ బాబుకు కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల సమగ్ర అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు చేసిన తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి, మంథని నియోజకవర్గ శాసనసభ్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ,మండల ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు,కృతజ్ఞతలు తెలియజేశారు.మండలంలోని అన్ని గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాలు,ఐకేపీ ఎస్ హెచ్ జి,మహిళా సమాఖ్య వివో భవనాల నిర్మాణం కోసం 202627 ఆర్థిక సంవత్సరానికి గాను, వి బి జి రామ్,ఉపాధి హామీ నిధుల నుండి రూ. 2 కోట్ల 52 లక్షలను మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో మంజూరు చేయించారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ మంథని ప్రాంత అభివృద్ధి ప్రదాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మంత్రి శ్రీధర్ బాబు నాయకత్వంలో ముత్తారం మండలం అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోతోందని కొనియాడారు.గ్రామీణ ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు స్వంత భవనాలు,అలాగే మహిళా సంఘాల బలోపేతానికి స్వంత బిల్డింగ్‌ల నిర్మాణం కోసం ఒకేసారి ఇంత పెద్ద మొత్తంలో నిధులు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.మహిళా సాధికారతకు,గ్రామీణ వికాసానికి ఈ నిధులు ఎంతగానో దోహదపడతాయని,మండల ప్రజల పక్షాన మంత్రికి ఎల్లప్పుడూ కృతజ్ఞులై ఉంటామని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి.

## దుర్గమాతల నిమజ్జనానికి, దసరాకు ఘనంగా ఏర్పాట్లు



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ నగరపాలక సంస్థ ద్వారా దుర్గమాత విగ్రహాల నిమజ్జన మహోత్సవానికి, దసర పండగకు సర్వం సిద్ధం చేశామని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ వెల్లడించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 21వ తేదీన నగరంలో వైభవంగా జరగనున్న దుర్గమాత నిమజ్జన కార్యక్రమాల నేపథ్యంలో సోమవారం సంబంధిత అధికారులతో కలిసి పలు నిమజ్జన పాయింట్లను సందర్శించి, పరిశీలించారు. మానకొండూర్, కొత్తపల్లి నిమజ్జన పాయింట్ల వద్ద జరుగుతున్న ఏర్పాట్లను మేయర్ క్షుణ్ణంగా పరిశీలించారు. భక్తులకు, ఉత్సవ కమిటీ సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచనలు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. మరో వైపు నగర వ్యాప్తంగా జరిగే దసర ఉత్సవాలకు నగరపాలక సంస్థ ఆద్వర్యంలో ఏర్పాట్లు చేయడం జరిగింది. గిద్దెపెరుమాండ్ల దేవాలయం తో పాటు పలు ఆలయాల్లో శమిపూజ కార్యక్రమానికి కావల్సిన సౌకర్యాలు కల్పించి... దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేదుకు చర్యలు చేపట్టడం జరిగింది . ఈ సంధర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ... నగర ప్రజలు విజయదశమి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. రేపు జరగబోయే దసర ఉత్సవాలను, దుర్గమాత నిమజ్జనం ఉత్సవాలను ప్రశాంత వాతావరణం లో భక్తిశ్రద్దలతో జరుపుకోవాలని పిలుపు నిచ్చారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సూచనల మేరకు గణేష్, బతుకమ్మ నిమజ్జనాలను ఎలాగైతే ఎలాంటి లోటుపాట్లు, ఇబ్బందులు కలగకుండా ముగిసాయో... దుర్గమాతల విగ్రహాల నిమజ్జనాలను కూడ అదే స్థాయిలో ముగిసేలా కట్టుదిట్టమైన చర్యలు తీస్కోవడం జరుగుతుందని తెలిపారు. ఉత్సవ కమిటీల సభ్యులు, భక్తులు ప్రశాంత వాతావరణం నిమజ్జనం పాయింట్లను వినియోగించుకొని దుర్గమాత నిమజ్జనాలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముగించేలా నగరపాలక సంస్థ కు సహకరించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు, అధికారలు పాల్గొన్నారు.

## దసరా పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

**ప్రజాపక్షం/గన్నేరువరం :** మండల ప్రజలందరూ సుఖ సంతోషాలతో దసరా పండుగను కుటుంబ సభ్యుల మధ్య ప్రశాంతంగా జరుపుకోవాలని గన్నేరువరం బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంప వెంకన్న కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు తెలంగాణకే పరిమితమైన బతుకమ్మ పండుగ నేడు విశ్వవ్యాప్తంగా తెలంగాణ సంస్కృతి చేరడం గర్వంగా ఉందన్నారు. తెలంగాణ పండుగ విశిష్టతను భావితరాలకు అందిస్తూ మన సంసృ్కతి సంప్రదాయాలను కాపాడుకోవాలని పేర్కొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌కు ఘన సత్కారం



**ప్రజాపక్షం / జమ్మికుంట :** ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మలిశెట్టి కుమార్ సాహిత్య రంగంలో చేసిన కృషికి గుర్తింపుగా జాతీయస్థాయిలో 2026 విజయదశమి పురస్కారానికి ఎంపికయ్యారు. శ్రీ గీతమేశ్వర సాహితీ కళాశేవ సంస్థ 6వ వార్షికోత్సవం సందర్భంగా అధ్యక్షులు దూడపాక శ్రీధర్ ఆదివారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాయ గాన సభ సంగీత నాట్య కళా వేదికలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌కు స్వర్ణ కంకణం ధరింపజేసి పురస్కారం అందజేస్తూ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మలిశెట్టి కుమార్ సాహితీ రంగంలో చేసిన కృషిని కొనియాడారు.

## లోక కల్యాణార్థం దేవి నవరాత్రి ఉత్సవాలు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** సిరిసిల్ల పట్టణంలోని 6వ వార్డు శ్రీ కనకదుర్గ అంబా భవానీ దేవాలయం, 39వ వార్డులోని శ్రీ కంచి కామాక్షి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి దుర్గ భవానీని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధ్యాత్మిక వాతావరణంలో లోక కళ్యాణార్థం దేవీ నవరాత్రి ఉత్సవాలను ఎంతో భక్తి శ్రద్ధలతో యజ్ఞయాగాలు అమ్మవారికి నిత్యం పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు. అమ్మవారి చల్లని దీవెనలతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో వ్యవసాయ తదితర రంగాలలో స్వయం ఉపాధి అభివృద్ది రంగాలలో, ఉద్యోగ ఉపాధి రంగాలలో వృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ పూజా కార్యక్రమాలలో కౌన్సిలర్ సభ్యులు దూడం రజనీ శ్రీనివాస్, ఆకుల స్వప్న కృష్ణ, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తాటి వెంకన్న, పద్మ, మాజీ కౌన్సిలర్ చిలక నారాయణ, పోరండ్ల రమేశ్, బూర భాస్కర్, కన్నె రమేశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పొట్యాలలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు

**ప్రజాపక్షం/అంతర్గాం:** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం పొట్యాల గ్రామంలో ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.బీజేపీ అంతర్గం మండల అధ్యక్షుడు బోడకుంట సుభాష్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో జీవించాలని,గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.హిందూ సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడటంలో ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు కీలకమని, యువతలో భక్తిభావం, ఐకమత్యం, సేవాభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ఛత్రపతి శివాజీ యూత్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు రావుల సాగర్,వేల్పుల శ్రీధర్, వేల్పుల అరవింద్,శ్రీనిత్,సన్నీ,రాకేష్, హర్షిత్, అనిల్,సంజయ్ లు పాల్గొన్నారు.

# పల్లె పల్లెనా పూల సింగిడి



ప్రజాపక్షం/బీర్‌పూర్ : జగిత్యాల జిల్లా బీరుపూర్ మండలం వీధి వీధినా మార్మోగిన ఉయ్యాల పాటలు పాడిన ఆడబిడ్డలు అంబరాన్నింటిన సద్దుల బతుకమ్మ సంబరాలు బీరుపూర్ మండలం లోని గ్రామాల్లో మహిళా ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించే బతుకమ్మ వేడుకల్లో చివరి ఘట్టమైన సద్దుల బతుకమ్మ పండుగను మండల వ్యాప్తంగా సోమవారం వైభవంగా నిర్వహించారు . అడపదడపల ఆనందోత్సాహాలకు అవధులు లేకుండా సంబరాలు అంబరాన్నంటాయి.ఊరు.వాడ పూలవనాలను తలపించాయి . బతుకమ్మ పాటలతో పల్లె పల్లె మార్మోగింది ఎక్కడా చూసినా బతుకమ్మలతో పుడమి పై పూలవర్షం కురిసినట్లు కనిపించింది. మహిళలు,యువతులు సోమవారం ఉదయం నుంచి తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి పనిలో నిమగ్నమయ్యారు. సాయంత్రం వేళ ప్రధాన కూడళ్లలో బతుకమ్మల చుట్టూ ఆడిపాడుతూ, కోలాట నృత్యాలతో సందడి చేశారు.అనంతరం మహిళలు గౌరమ్మకు నైవేద్యాలు సమర్పించారు.ఒక్కరికొకరకు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.అనంతరం సమీపంలోని చెరువులు. గోదావరి ..కుంటల్లో బతుకమ్మలను నిమజ్జనం చేసి పోయిరా గౌరమ్మ. పోయి రావమ్మా అంటూ వీడ్కోలు పలికారు.బతుకమ్మ వేడుకలు ప్రశాంతంగా జరిగేలా,ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా మండల పోలీసులు,సర్పంచ్ లు, ఉపసర్పంచ్ లు,వార్డు సభ్యులు,మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు,యూత్ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



ప్రజాపక్షం/జగిత్యాలరూరల్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను జగిత్యాల అర్బన్, రూరల్ మండలం లోనీ గ్రామాలలో మహిళలు భక్తిశ్రద్ధలతో,ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీకగా భావించే బతుకమ్మ వేడుకల్లో భాగంగా సద్దుల బతుకమ్మ సోమవారం రోజున జగిత్యాల అర్బన్, రూరల్ మండలంలో మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రకృతిని ఆరాధిస్తూ పూలనే దైవస్వరూపంగా భావించి జరుపుకునే ఈ పండుగలో మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. ప్రకృతి పరిరక్షణ, పూల ప్రాధాన్యత, కుటుంబ అనుబంధాలు, సామూహిక ఐక్యతను ప్రతిబింబించే బతుకమ్మ పండుగను జగిత్యాల మండల మహిళలు ఉత్సాహంగా జరుపుకోవడంతో పల్లెల్లో పండుగ శోభ సంతరించుకుంది.

## గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలి

ప్రజాపక్షం/మల్లాపూర్ : వైద్య వృత్తిలో పేద ప్రజలకు సేవలు అందించి వైద్య వృత్తికి రాజీనామా చేసి దళిత బహుజన హక్కుల కోసం పోటుపడుతున్న డాక్టర్ పెరుమల్ల రామకృష్ణకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవిని కేటాయించాలని తెలంగాణ మాష్టిన్ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుద్ధుల గంగ నరసయ్య ఓ ప్రకటన ద్వారా ప్రభుత్వాన్ని కోరారు.కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల హక్కుల కోసం నిత్యం చేస్తున్న పెరుమండ్ల రామకృష్ణ కు రాష్ట్ర ముఖ్యమంత్రి చొరవ తీసుకొని గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని గంగా నరసయ్య తెలిపారు

## రత్నాపూర్ అమ్మవారి సన్నిధిలో కుంకుమార్చన

ప్రజాపక్షం/మల్లాపూర్ : దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాలలో దేవి అమ్మవారు ప్రత్యేక పూజలను అందుకుంటున్నారు. ఈమేరకు రత్నాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపంలో సోమవారం పెద్ద ఎత్తున మహిళలు కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొండ రాజేందర్, ఉపసర్పంచ్ శ్రీనివాస్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

## ఐక్యత ద్వారానే హక్కుల సాధన

ప్రజాపక్షం/ధర్మపురి: నేతకాని సమాజం తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని నేతకాని విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, టివిఎస్‌ఎంవిఎస్ ఒయుజెఎసి నాయకుడు సాయిని ప్రసాద్ నేత పిలుపునిచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎస్సీ వర్గీకరణలో నేతకాని సామాజిక వర్గానికి అన్యాయం జరిగిందని, వర్గీకరణలో తమ సమాజాన్ని గుర్తించకపోవడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ధర్మపురి మండల కేంద్రంలోని ఎస్‌హెచ్ గార్డెన్‌లో సోమవారం నేతకాని కుల సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షుడు, కార్యక్రమ కో కన్వీనర్ దుర్గం రవీందర్ నేతకాని అధ్యక్షతన నిర్వహించిన మండలస్థాయి సమావేశానికి సాయిని ప్రసాద్ నేత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఎస్సీ వర్గీకరణ కారణంగా నేతకాని సమాజానికి కలిగే నష్టాలను కుల బాంధవులకు వివరించారు.ఈ సమస్యపై ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఇందులో భాగంగా నవంబర్ 15న రాష్ట్రస్థాయిలో భారీ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ధర్మపురి మండలంలోని నేతకాని కుల బాంధవులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి 'హలో నేతకాని – చలో ఉస్మానియా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం డైరెక్టర్ తాళ్లపల్లి రాజేశ్వర్,వైస్ చైర్మన్ బోర్లకుంట ప్రభుదాస్, ప్రోగ్రాం కోకన్వీనర్ జాడి గంగాధర్,విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి దుర్గం వినోద్ కుమార్, జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షుడు పిప్పల గంగాధర్,నేతకాని సంఘం నాయకులు అల్లూరి పవన్ కుమార్, సొగల సతీష్,తంతాని శంకరయ్య,తదితరులు పాల్గొన్నారు.



## బహుజన సేన ఆధ్వర్యంలో రాజ్యాంగ అవగాహన సదస్సు

ప్రజా పక్షం/వేములవాడ టౌన్: బహుజన సేన ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కదిరే కృష్ణను బహుజన సేన రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు జింక శ్రీధర్ ఆధ్వర్యంలో జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్వహించనున్న భారత రాజ్యాంగ ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహణకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జింక శ్రీధర్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే, ఛత్రపతి సాహు మహారాజ్, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వంటి మహనీయుల ఆశయాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. సమాజంలో విద్య, విజ్ఞానం, సమానత్వం, సామాజిక న్యాయం పట్ల అవగాహన పెంపొందించి, విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, స్వేచ్ఛలు, సమానత్వం, సామాజిక న్యాయం వంటి విలువలను ప్రజలకు వివరించేందుకు రాజ్యాంగ ప్రాముఖ్యతపై అవగాహన సదస్సులు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ముఖ్యంగా యువతకు రాజ్యాంగంపై అవగాహన కల్పించడం ద్వారా ప్రజాస్వామ్య విలువలను మరింత బలోపేతం చేయవచ్చని అభిప్రాయపడ్డారు. జిల్లాలో రాజ్యాంగ అవగాహన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా శాఖ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బహుజన సేన రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ గౌరవఅధ్యక్షులు గుడిసె మనోజ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు సుంకరి శ్రీకాంత్ యాదవ్, గుడిసె శశి కుమార్ పాల్గొన్నారు.



## రామగుండంలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

ప్రజాపక్షం/పెద్దపల్లి: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగ వేడుకలు రామగుండం నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. నియోజకవర్గంలోని అడ్డగుంటపల్లి సెంటర్, మారుతి నగర్ హనుమాన్ టెంపుల్, దుర్గా నగర్, ఐబీ కాలనీ, నరశాలపల్లి, అన్నపూర్ణ కాలనీ, న్యూ పోరాట్ పల్లి, స్వతంత్ర చౌక్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి సతీమణి శ్రావ్య పటేల్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని మహిళలతో కలిసి ఆమె బతుకమ్మ ఆడుతూ పండుగ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల మధ్య మహిళల ఆటపాటలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆయా ప్రాంతాల్లో పండుగ సందడి నెలకొంది. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ పాటలు పాడుతూ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.ఈ సందర్భంగా వ్యాల్ల హరీష్ రెడ్డి మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు, మహిళల ఐక్యతకు ప్రతీక అని, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని తరతరాలకు చాటిచెప్పే గొప్ప పండుగ అని పేర్కొన్నారు.తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే బతుకమ్మ వేడుకలను ప్రజలందరూ ఐకమత్యంతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవడం సంతోషకరమని ఆయన తెలిపారు.



## ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని మొక్కులు

ప్రజాపక్షం/రామగుండం : రామగుండం పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో రక్ష యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన దేవీ నవరాత్రి ఉత్సవాల్లో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సహస్ర దీపాలంకరణ కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేసి,జ్యోతిర్లింగాలకు అభిషేకం నిర్వహించి ప్రజలంతా ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించి సన్మార్గంలో నడిచేందుకు దోహదపడతాయని అన్నారు. పారిశ్రామిక ప్రాంతంలో ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు.ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన రక్ష యూత్ సభ్యులను అభినందించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధ్యక్షులు,కార్యకర్తలు,స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## దుర్గా భవానీ ఆలయంలో మాజీ మంత్రి ప్రత్యేక పూజలు

ప్రజాపక్షం/గొల్లపల్లి : జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని పలు గ్రామాలలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తి సభ్యుల మధ్య అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి.ఈ ఉత్సవాల్లో భాగంగా మండలంలోని శ్రీరాములపల్లె గ్రామంలో శ్రీ దుర్గా భవాని అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న 30వ శరన్నవ రాత్రుల వేడుకల్లో సోమవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన స్థానిక నాయకులతో కలిసి దుర్గామాత ఆలయంలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ అర్చకులు,కమిటీ సభ్యులు స్వాగతం పలికారు.స్థానిక నాయకులు మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ ను శేష వస్త్రంతో సన్మానించి అమ్మవారి తీర్థ ప్రసాదం అందజేశారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం శ్రీ దుర్గా భవాని అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో సంతోషాన్నిస్తుందని తెలిపారు. అమ్మవారి దివ్య అనుగ్రహంతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, ఆయురారోగ్యాలు,అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రితో పాటు స్థానిక సర్పంచ్ సల్లూరి శోభన్ గౌడ్, మాజీ జెడ్పిటిసి, గోస్కుల జలంధర్, ఆలయ కమిటీ సభ్యులు భవాని దీక్షాపరులు,తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో దుర్గామాత నిమజ్జన శోభాయాత్ర

ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని పాత బస్టాండ్, కొత్త బస్టాండ్ ఆవరణల్లో ఏర్పాటు చేసిన దుర్గామాతలు తొమ్మిది రోజులపాటు విశేష పూజలు అందుకున్న అనంతరం సోమవారం నిమజ్జనానికి బయలుదేరాయి.ఈ సందర్భంగా ఆయా దుర్గా కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాలపై అమ్మవార్లను అలంకరించి పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు.మహిళలు మంగళహారతులతో అమ్మవార్లకు స్వాగతం పలికి భక్తిని చాటుకున్నారు.అనంతరం కొత్త బస్టాండ్,లైబ్రరీ వద్ద మహిషాసుర మర్దిని కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆయా దుర్గా కమిటీల సభ్యులు,భక్తులు పాల్గొన్నారు.

## సోమేశ్వరాలయంలో భక్తుల ప్రత్యేక పూజలు

ప్రజాపక్షం/మల్లాపూర్ : ప్రాచీన ఆలయంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ కనక సోమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రోజున భక్తులు పెద్ద మొత్తంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.కాలినడకన ఎత్తైన కొండపైకి చేరుకొని పవిత్ర కోనేటిలో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదలను స్వీకరించారు. అనంతరం కొండ కింద గ్రామ అభివృద్ధి కమిటీ సహకారంతో ముత్యంపేట గ్రామానికి చెందిన దాతలు దారవేణి జీవన్ ,మహేష్ సరిత దంపతులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని జరిపించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ క్యాతం సురేష్ రెడ్డి,వైస్ చైర్మన్ గంగా నరసయ్య,కమిటీ సభ్యులు,భక్తులు పాల్గొన్నారు.

## రేంగన్వాడీలో దోమల స్వైరవిహారం

**ప్రజాపక్షం/నేరడిగొండ:** నేరడిగొండ మండలం బొందిడి పంచాయతీ పరిధిలోని రేంగన్వాడీ గిరిజన గ్రామంలో పారిశుద్ధ్యం పూర్తిగా మృగ్యమైంది. డ్రైనేజీల్లో మురుగు నీరు నిలిచి దోమలు విజృంభిస్తుండటంతో గ్రామస్థులు రోగాల బారిన పడుతున్నారు. అధికారులు డ్రై డే, ఫ్రైడే అని ప్రచారం చేయడమే తప్ప గ్రామంలో పూడికతీత పనులు చేపట్టింది లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలు శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

## వాడీ నవదుర్గాసేవ సమితి ఆధ్వర్యంలో బోనాలు

**ప్రజాపక్షం/నిజామాబాద్ రూరల్ :** నవ దుర్గాసేవా సమితి ఆధ్వర్యంలో బోనాల కార్యక్రమం వాడీ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. మహిళలు, దేవిమాలధారులు పెద్ద ఎత్తున బోనాలు తీశారు. మర్రి చెట్టు వద్ద నవదుర్గమాతా మంటపం నుంచి హనుమాన్ ఆలయం, గాంధీ ఎస్సి కాలనీ మీదుగా పెద్దమ్మ ఆలయం వరకు బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవి ఆలయం వద్ద శరన్నరాత్రుల ప్రత్యేక పూజలు, అన్నదానం చేశామన్నారు. కార్యక్రమంలో ప్రజలు పాల్గొన్నారు.

## కొండగట్టు అంజన్నను దర్శించుకున్న జడ్జి

**ప్రజాపక్షం/మల్యాల :** తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్ కుటుంబసమేతంగా కొండగట్టు ఆంజనేయస్వామి స్వామివారిని సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వేదమంత్రోచ్ఛారణలతో ఆశీర్వచనం అం దించి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాన్ని అం దజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పరిశీలకులు లక్ష్మిరెడ్డి, ప్రధాన అర్చకులు చిరంజీవ స్వామి, ఉప ప్రధాన అర్చకులు రామచంద్ర ప్రసాద్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు

## హైమాస్ట్ లైట్ ప్రారంభం

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని లక్ష్మీపూర్ గ్రామం గ్రామాభివృద్ధిలో మరో ముందడుగు పడింది. గ్రామంలోని 2వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్‌ను గ్రామ సర్పంచ్ కాసం రాజశేఖర్ గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధుల తో కలిసి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కాసం రాజశేఖర్ మాట్లాడుతూ మాటల్లో కాదు చేతల్లో అభివృద్ధి చూపించడమే మా లక్ష్యం. ఈ నూతన హైమాస్ట్ లైట్ ఏర్పాటుతో ఈ ప్రాంతమంతా ప్రకాశవంతంగా మారిందని రాత్రి వేళల్లో ప్రజలకు మెరుగైన వెలుతురుతో పాటు స్ఫూర్తి భద్రత సౌకర్యం చేకూరుతుందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రేవెల్లె సత్య నారాయణ గౌడ్, ఉపసర్పంచ్ సంఘం రజిత తిరుపతి , 2వ వార్డు సభ్యులు బలిజపల్లి తిరుపతి,6వ వార్డు సభ్యులు కాసేటి తిరుపతి తో పాటు గ్రామ పెద్దలు,యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్:** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణుతో కలిసి ఆయన అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా ఎప్పటికప్పుడు పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. కాగా, జైనూర్ మండల కేంద్రానికి చెందిన ఆత్రం శంభు మీ సేవా కేంద్రం మంజూరు చేయాలని, సిర్పూర్ టి మండలం లక్ష్మీపూర్ వాసి రాకేష్ కుమార్ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని కోరుతూ దరఖాస్తులు సమర్పించారు. ఆసిఫాబాద్ ఆసుపత్రిలో పనిచేస్తున్న వేములవాడ రవీందర్ అనారోగ్య కారణాలతో తన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. చింతలమానేపల్లి మండలం డబ్బా గ్రామానికి చెందిన జుమ్మిడి అరుణ ఉపాధి కల్పించాలని, కాగజ్‌నగర్ మండలం అనుకూడ గ్రామానికి చెందిన శంకర్ పాఠశాల వంటగది నిర్మాణ బిల్లు చెల్లించాలని అర్జీలు అందజేశారు. జైనూర్ మండలం పొలస వాసి కుర్సింగ సురేఖ, ఆసిఫాబాద్ మండలం ఇప్పలనవేగాం గ్రామానికి చెందిన గుర్నూలె ఉషారాణి అంగన్‌వాడీ ఉద్యోగాలు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు పాల్గొన్నారు.

## పాత ఎల్లాపూర్ సర్పంచ్ వినూత్న నిర్ణయం

### సొంత నిధులతో ఆడపిల్లల పేరిట రూ.50 వేల నుంచి రూ.2.25 లక్షల వరకు డిపాజిట్



**ప్రజాపక్షం /ఖానాపూర్ :** మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామ సర్పంచ్ ఏలేటి ప్రశాంత్ రెడ్డి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తన సొంత నిధులతో ఆడపిల్లల పేరిట డిపాజిట్లు చేయనున్నట్లు ప్రకటించారు.గ్రామంలో ఒక ఆడపిల్ల పుడితే రూ.50 వేలు, ఇద్దరు ఆడపిల్లలు పుడితే రూ.లక్ష, ముగ్గురు ఆడపిల్లలు పుడితే రూ.2.25 లక్షలు వారి పేర్ల మీద డిపాజిట్ చేయనున్నట్లు తెలిపారు. ఆడపిల్లల పట్ల వివక్షను తొలగించి, వారి భవిష్యత్తుకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు.సర్పంచిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రశాంత్ రెడ్డి గ్రామ ప్రజలకు ఉపయోగపడే పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పాఠశాల విద్యార్థులకు ఉచిత వాహన సౌకర్యం, ఉచిత టిఫిన్, అనారోగ్యంతో బాధపడే గ్రామస్తులకు ఉచిత అంబులెన్స్ సేవలు,వైద్య చికిత్సకు సహాయం, నిరుపేదలకు బీమా సదుపాయాలు వంటి కార్యక్రమాలను చేపడుతున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఆడపిల్ల అంటే భారం కాదని,ఆమె ఇంటి మహాలక్ష్మి అని పేర్కొన్నారు.ఆడపిల్లల పట్ల వివక్ష చూపకుండా వారిని ఆదరించాలని, భ్రూణహత్యలను అరికట్టి ఆడబిడ్డలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.ఆడపిల్లల సంక్షేమం కోసం సొంత నిధులతో వినూత్న పథకాన్ని ప్రకటించిన ప్రశాంత్ రెడ్డిని పాత ఎల్లాపూర్ గ్రామస్తులతో పాటు పలువురు అభినందిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, దాతలు ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలకు ముందుకొస్తే నిరుపేద కుటుంబాలకు మరింత తోడ్పాటు అందుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## దుర్గామాతను దర్శించుకున్న కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం /నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణంలోని మహాలక్ష్మి ఆలయంలో దుర్గామాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ కుచాడి శ్రీహరి రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీ అప్పాల గణేష్ చక్రవర్తి.ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి,ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు.అనంతరం ఆలయ పరిసరాల్లో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు.భక్తుల సౌకర్యార్థం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మరియు ఆలయ కమిటీ చైర్మన్లు,నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## బావాపూర్ ఆర్ తండాలో తీజ్ సంబరాలు



**ప్రజాపక్షం /ఖానాపూర్ :** ఖానాపూర్ మండలంలోని బావాపూర్ ఆర్ తాండాలో నవరాత్రి తీజ్ సంబరాలు వైభవంగా కొనసాగినవి.శ్రీ జగదాం భక్తురాలు శారదా బాయి ఆదేశానుసారం ఆదివారం ఈ ఉత్సవాలు ప్రారంభించారు.బంజారా గిరిజనుల అతి పెద్ద పండుగ అయిన తీజ్ పండుగను ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా బావాపూర్ ఆర్ తాండాలో సంప్రదాయబద్ధంగా, భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ పండుగలో భాగంగా మహిళలు గోధుమలను చల్లి మొలకలు పెంచుతూ 9 రోజుల పాటు ప్రత్యేక ఆచారాలు, పూజలు పాటిస్తారు. తొమ్మిది రోజులు తీజ్ ను భక్తితో పూజించి,చివరి రోజున సంప్రదాయబద్ధంగా నిమజ్జనం చేస్తారు.తీజ్ సంబరాలతో బావాపూర్ ఆర్ తాండా మొత్తం భక్తి వాతావరణం నెలకొంది. తాండాలోని మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని తీజ్ పాటలు పాడుతూ సంబరాలు జరుపు ఉన్నారు.తదనంతరం తేజు బుట్టల నిమజ్జన కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు.

## లోకేశ్వరంలో గంగ నీళ్ల జాతర

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండల కేంద్రంలోని గంగ నీళ్ల జాతర ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ కపిల్, గ్రామ పెద్దలు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గంగ నీళ్ల జాతర ఘనంగా జరుపుకుంటామని గోదావరి నది వరకు మంగళ వాయిద్యాలతో నడుచుకుంటూ వెళ్లి గోదావరి నది నీళ్లు తీసుకువచ్చి గ్రామంలోని దేవతలకు గంగాభిషేకం చేసి అభిషేకాలు అర్చనలు నిర్వహించి గంగాదేవికి హారతులు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని పాడి పంటలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆ భగవంతునికి ప్రార్థన చేస్తారు.ఈ కార్యక్రమంలో విడీసీ సభ్యులు,గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం / హాజీపూర్:** జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు చెట్టును ఢీకొన్న ఘటనలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, స్కూటీపై వెళ్తున్న మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. హాజీపూర్ ఎస్ఐ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. నంనూర్ గ్రామంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీకి చెందిన నడిపెల్లి శ్రీమాన్ రావు (43) ఆదివారం మధ్యాహ్నం పని నిమిత్తం కారులో మంచిర్యాలకు వెళ్లారు. పని ముగించుకుని రాత్రి తిరిగి నంనూర్ బయలుదేరిన క్రమంలో, వేంపల్లిలోని ఎంవిఆర్ పెట్రోల్ బంక్ సమీపంలో ఎన్హెచ్63పై అర్ధరాత్రి సుమారు 12 గంటల ప్రాంతంలో కారు అదుపుతప్పింది. ముందు వెళ్తున్న ఎలక్ట్రిక్ స్కూటీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టి, అనంతరం పక్కనే ఉన్న రావి చెట్టుకు తగిలింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన శ్రీమాన్ రావు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. స్కూటీ నడుపుతున్న చిలుముల రవితేజకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడి తండ్రి చిలుముల బొందయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్యం రెడ్డికి సన్మానం

**ప్రజాపక్షం/దిలావర్‌పూర్ :** బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన దొడ్డికింది ముత్యం రెడిని దిలావర్‌పూర్ గ్రామ బిజెపి నాయకులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పార్టీ ప్రతినిధులు ఆయనను పూలమాలలు, శాలువాలతో అభినందించారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి, మాజీ సర్పంచ్ వీరేష్ కుమార్, పిఎసిఎస్ డైరెక్టర్ సుధాకర్ రెడ్డి,ఎఫ్ఎస్‌సిఎస్ డైరెక్టర్ రాజలింగం పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.అలాగే వార్డు సభ్యులు శ్రీకాంత్, కొతిమీరి నడ్పన్న, సాయి, బోజన్న, రవి, బొల్లా సాయిలతో పాటు ముఖ్య నాయకులు గంగారెడ్డి, బోజరం పటేల్, నర్సారెడ్డి, ధనే నర్సయ్య, మురళి, పండరి, రమేష్ రెడ్డి, నవీన్ రెడ్డి, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 21న నూతన అగ్నిమాపక కేంద్రానికి శంకుస్థాపన

**ప్రజాపక్షం /ఖానాపూర్ :** ఖానాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ కొమురం భీం చౌరస్తా వద్ద నిర్మించనున్న నూతన అగ్నిమాపక కేంద్రం భవన నిర్మాణానికి 21న శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ఇంఛార్జి అగ్నిమాపక అధికారి మామిడి భగవాన్ రెడ్డి తెలిపారు.బుధవారం ఉదయం 11 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొననున్నారు.నూతన అగ్నిమాపక కేంద్రం భవన నిర్మాణంతో ఖానాపూర్ పరిసర ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు,అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు మరింత వేగంగా సేవలు అందించే అవకాశం ఉంటుందని అధికారి తెలిపారు.ఈ శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు,ప్రజలు పాల్గొనాలని జిల్లా అగ్నిమాపక అధికారి కోరారు.

## వెల వెల బోయిన ప్రజావాణి

**ప్రజాపక్షం/మల్యాల :** ప్రజల సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అయితే మల్యాల మండలంలో ఈ కార్యక్రమానికి అధికారుల హాజరు అంతంతమాత్రంగానే ఉంటోంది. ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన ప్రజావాణికి వివిధ శాఖల అధికారులు హాజరుకావాల్సి ఉండగా..ఎంపీడీవో, తహసీల్దార్‌తో పాటు కొద్ది శాఖల అధికారులే కనిపించారు.మరికొందరు హాజరు నమోదు చేసుకున్నట్లుగా కొద్దిసేపు ఉండి వెళ్లిపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదులు చేసేందుకు వచ్చినప్పుడు సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోతే వారి ఇబ్బందులు ఎవరికి చెప్పుకోవాలనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ప్రజావాణిలో ఫిర్యాదుల సంఖ్య కూడా తక్కువగానే నమోదవుతోంది. సోమవారం ఒక్క ఫిర్యాదు మాత్రమే అందినట్లు ఎంపిడిఓ స్వాతి తెలిపారు.ప్రజావాణి నిర్వహణపై ప్రజలకు మరింత అవగాహన కల్పించడంతోపాటు అన్ని శాఖల అధికారులు నిర్ణీత సమయానికి హాజరయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.ప్రజల సమస్యల పరిష్కారానికి ఉద్దేశించిన ఈ కార్యక్రమం కేవలం లాంఛనప్రాయంగా మిగిలిపోకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు



ప్రజాపక్షం/భైంసా : భైంసా పట్టణంలోని గణేష్ నగర్ కాలనీలో చోటుచేసుకుంది.కాలనీకి చెందిన సాయినాథ్, గంగామణి దంపతుల కుమార్తె అవలిక నాలుగో తరగతి చదువుతోంది.తండ్రి సాయినాథ్ నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా, తల్లి గంగామణి సోమవారం అనారోగ్యంతో కన్నుమూశారు.దీంతో అవలిక తల్లిదండ్రులిద్దరినీ కోల్పోయి ఒంటరిగా మిగిలింది. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండటంతో తల్లి అంత్యక్రియలు నిర్వహించేందుకు కూడా డబ్బులు లేక చిన్నారి దిక్కుతోచని స్థితిలో ఉంది.కన్నతల్లి మృతదేహం వద్ద దీనంగా ఎదురుచూస్తున్న ఆ చిన్నారి పరిస్థితి స్థానికులను కలచివేస్తోంది. ఈ విషాద సమయంలో దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి చిన్నారికి ఆపన్న హస్తం అందించాలని స్థానికులు కోరుతున్నారు. అంత్యక్రియల నిర్వాహణతో పాటు చిన్నారి అవసరాలను తీర్చడం కోసం భవిష్యత్తులో ఆమెకు అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# బండి సంజయ్‌ని కలిసిన జై జవాన్ సేవా సమితి సభ్యులు



ప్రజాపక్షం/భైంసా : కేంద్ర మంత్రి బండి సంజయ్ కరీంనగర్ లోని వారినివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.జై జవాన్ సేవాసమితి చేసిన ఉచిత సామాజికసేవా కార్యక్రమాలు గురించి త్రివిధదళాలకు చేరడానికి శిక్షణ, నిరుపేదలకు రేషన్ పంపిణీ, అనాథ పిల్లలకు విద్య,ఆసక్తి ఉన్న యువతకు ఉచితంగా శారీరక శిక్షణ ఇచ్చి జీవితంలో స్థిరపడడానికి సహకారం అందించడం జరిగింది.ఈ సమితి కార్యక్రమాలను తెలుసుకొని అభినందించడం జరిగింది.భవిష్యత్తులో పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించాలని కోరుతూ, త్వరలో నిర్వహించే సేవా కార్యక్రమాలకు నేను వస్తానని హామీ ఇవ్వడం జరిగింది. అదేవిధంగా మీకు ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా తప్పకుండా అందిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మల్లేష్, దిలీప్, భీమశంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# దీపారాధన



ప్రజాపక్షం/మావల: శ్రీ నవశక్తి శారదా దేవి మండలి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, దీపారాధన కార్యక్రమం వైభవంగా జరిగింది. మహిళలు, భక్తులు హాజరై ప్రమిదలు వెలిగించి అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మండలి ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# విధుల్లోనే గుండెపోటుతో గ్రామ పంచాయతీ కార్మికుడు మృతి



ప్రజాపక్షం/ఖానాపూర్ : తీవ్రమైన గుండెపోటుతో గ్రామ పంచాయతీ కార్మికుడు మృతి చెందిన ఘటన సోమవారం ఎర్వచింతల్ గ్రామంలో చోటు చేసుకుంది.గ్రామస్థులు, కుటుంబీకుల వివరాల మేరకు గ్రామానికి చెందిన చిట్యాల రాజన్న (57) గ్రామంలో గత 20 సంవత్సరాల నుంచి గ్రామ పంచాయతీ కార్మికుడు (ఎంపిడబ్ల్యూ) గా పనిచేస్తున్నారు.సోమవారం మండల ఎంపిడిఓ గ్రామ పర్యటనకు రానున్న నేపథ్యంలో ఉదయం 7 గంటలకు విధులు ఊ ద్చేందుకు గ్రామంలోని చామన్ పల్లి తండాకు వెళ్లాడు. అనంతరం ఎస్‌సి కాలనీలో పారిశుధ్య పనులు చేస్తుండగా చిట్యాల రాజన్నకు తీవ్రమైన గుండెపోటు రావడంతో రోడ్డుపైనే కుప్పకూలిపోయాడు.స్థానికులు,కుటుంబీకులు రాజన్న ను ఖానాపూర్ లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి అప్పటికే చనిపోయినట్లు తెలిపారు. దీంతో కుటుంబీకులు, గ్రామస్థులు కన్నీరు మున్నీరుగా విలపించారు.ఆర్థికంగా, సామాజికంగా ప్రభుత్వం నుంచి ఎటువంటి భద్రత లేకపోవడం, పిఎఫ్, ఇఎస్ఐ లేకపోవడంతో కార్మికుడి కుటుంబం రోడ్డున పడిందని పలువురు గ్రామ పంచాయతీ కార్మికులు వాపోయారు.

# ఎప్పటికప్పుడు ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం

## కలెక్టర్ భవేశ్ మిశ్రా



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు.ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు.ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు.అనంతరం జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్‌గోపాల్ ఆధ్వర్యంలో ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ సాచురేషన్ క్యాంపెయిన్ కు సంబంధించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ఈనెల 21వ తేదీ నుంచి నెలరోజు ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ సాచురేషన్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో నిర్వహించాలని తెలిపారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్,వెంకట మాధవ రావు,వివిధ శాఖల అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# వాకింగ్ ట్రాక్‌లు, ఫుట్‌పాత్‌ల పరిశీలనకు కలెక్టర్ హామీ

## ఆప్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సయ్యద్ హైదర్



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : పట్టణంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలు,వాకింగ్ ట్రాక్‌లు మరియు ఫుట్‌పాత్‌ల నిర్వహణలో జరుగుతున్న నిర్లక్ష్యంపై ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సయ్యద్ హైదర్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.2024 నుంచి ఈ సమస్యలపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం వల్లే ప్రస్తుతం పరిస్థితి తీవ్రంగా మారిందని ఆయన స్పష్టం చేశారు.షాపింగ్ మాల్స్ ఆక్రమణల కారణంగా ఫుట్‌పాత్‌లు మూసుకుపోయి, ప్రజలు వాకింగ్ ట్రాక్‌లను ఉపయోగించలేక ప్రాణాలను పణంగా పెట్టి రోడ్లపై నడవాల్సి వస్తోందని వివరించారు. అంతేకాకుండా ఫుట్‌పాత్‌ల నిర్మాణం కోసం కేటాయించిన 6 కోట్ల నిధుల వినియోగంపై సమగ్ర విచారణ జరిపించాలని కలెక్టర్‌ను కోరారు.ఈ వినతిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్, స్వయంగా క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చి వాకింగ్ ట్రాక్‌లు,ఫుట్‌పాత్‌ల పరిస్థితిని సమీక్షిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆప్ జిల్లా జనరల్ సెక్రటరీ సిహెచ్.వినోద్,ట్రెజరర్ అబ్దుల్ సాధిక్, టౌన్ ప్రెసిడెంట్ రవి, స్పోక్స్‌పర్సన్ వసంత్ రావు,నియోజకవర్గ ఇన్‌చార్జి మెరుగు రాజన్న,చొక్కాల భూమన్న,లాయర్ అరవింద్, షేక్ ఇమామ్,షేక్ షాదుల్లాతో పాటు పలువురు పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# డిఎస్‌పికి పెద్ద భీమన్న స్వామి జాతర ఆహ్వానం



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : మామడ మండలం పోతారం గ్రామంలో ఆదివాసి నాయకపోడ్ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న పెద్ద భీమన్న స్వామి వారి జాతర మహోత్సవ ఆహ్వాన పత్రికను నిర్మల్ డిఎస్‌పి శ్రీనివాస్, సోన్ సిఐ గోవర్ధన్ రెడ్డికి నాయకపోడ్ సేవా సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా అందజేశారు.ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ,ప్రతి సంవత్సరం సాంప్రదాయబద్ధంగా నిర్వహించే పెద్ద భీమన్న స్వామి జాతర 21 నుండి 26 వరకు వైభవంగా జరగనుందని తెలిపారు. జాతర ఉత్సవాల్లో భాగంగా 21న సాయంత్రం 7:30 గంటలకు స్వామివారిని గుడి నుండి మరం (ఇంటి) వద్దకు తీసుకురావడం జరుగుతుందన్నారు. అనంతరం 22, 23, 24 తేదీలలో పరిసర ప్రాంతాల గ్రామాల్లో స్వామివారి ఊరేగింపు నిర్వహించి, 24వ తేదీ శనివారం సాయంత్రం 6 గంటలకు స్వామి వారు తిరిగి పోతారం మరం వద్దకు చేరుకుంటారని వెల్లడించారు.అలాగే 25 ఆదివారం ఉదయం 8 గంటల నుండి ఊరేగింపు, సాయంత్రం 6 గంటలకు గంగ స్నానం, రాత్రి 12:30 గంటలకు గుడి వద్దకు గజాలు చేరుకుంటాయని తెలిపారు. చివరి రోజు 26 సోమవారం ఉదయం 7 నుండి 8 గంటల వరకు బండారు వసంతం, అనంతరం భక్తుల మొక్కుల చెల్లింపుతో జాతర మహోత్సవం ముగుస్తుందని వివరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకగారి భూమయ్య, జిల్లా ఉపాధ్యక్షులు సంచ శ్రీనివాస్, సత్యనారాయణ,రామకృష్ణ,పోతారం గ్రామ ఆదివాసి నాయకపోడ్ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# నవదుర్గా సన్నిధిలో మహా యజ్ఞం

ప్రజాపక్షం/లోకేశ్వరం : లోకేశ్వరం మండలం లోని అబ్దుల్లాపూర్ గ్రామంలో ప్రతిష్ఠించిన నవ దుర్గాసన్నిధిలో సోమవారం రోజు పురోహితులు రాజేశ్వర్ చారి ఆధ్వర్యంలో ఘనంగా మహాయజ్ఞం నిర్వహించారు. దుర్గామాత స్వాములు గ్రామంలోని పలువురు దంపతులు యజ్ఞంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా దుర్గామాత మహిషాసుర మర్దిని అవతారంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.యజ్ఞంలో డాక్టర్ సాగర్ మురళి గౌడ్,రమేష్, గణేష్ గౌడ్, చంద్రకాంత్ దంపతులతో పాటు మహేందర్, రాజు, శంకర్, నవీన్, నరేందర్‌గ్రామస్థులు, పాల్గొన్నారు.

# కోతుల బెడద తీర్చాలని కలెక్టర్‌కు వినతి



ప్రజాపక్షం/దిలావర్‌పూర్ : మండలంలోని లోలం గ్రామంలో తీవ్ర సమస్యగా మారిన కోతుల బెడదను నివారించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజా ఫిర్యాదుల'(ప్రజావాణి) కార్యక్రమంలో గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో కో తుల సంఖ్య విపరీతంగా పెరిగిపోయి నివాస గృహాలపై,పంట పొ లాలపై పడి ప్రజలను,రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం భయాందోళనల నడుమ గడపాల్సి వస్తోందని,అధికారులు తక్షణమే స్పందించి ప్రత్యేక చర్యల ద్వారా కోతులను పట్టుకుని అడవుల్లోకి తరలించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీహరి,సుధాకర్,శ్రీధర్, పెంట రాము, తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్మికులకు దుస్తుల పంపిణీ



ప్రజాపక్షం/బోథ్ : బోథ్ మండల కేంద్రంలో ని కౌట బి గ్రామంలో దసరా పండుగ సందర్భంగా కౌట (బి) సర్పంచ్ ఒరగంటి స్వామి పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎంపిఒ రాజకుమార్ మాట్లాడుతూ అందరూ పనులు సరిగ్గా చేయాలని,ఊరిని సస్యశ్యామల ఉంచాలి అని పారిశుద్ధ కార్మికులకు సూచనలు చేశారు.పారిశుద్ధ్య కార్మికులు గ్రామ పంచాయతీకి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. పరిశుద్ధ్య కార్మికులు దుస్తులు పంపిణీ చేసినందుకు సర్పంచ్ కృతజ్ఞత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రమణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి అంజయ్య, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పండుగ సాయన్న జయంతి పోస్టర్ల ఆవిష్కరణ



ప్రజాపక్షం/బోథ్ : బోథ్ మండల కేంద్రంలోని పండుగ సాయన్న జయంతి పోస్టర్ ఆవిష్కరణ చేసిన ముదిరాజ్ లు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా వీరుడు తెలంగాణ రాబిన్ హుడ్ పాలమూరులో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి దారుణంగా హత్య కావించబడ్డ ముదిరాజు ముద్దుబిడ్డ పండుగల సాయన్న 174వ జయంతి 22 తేదీన హైదరాబాదులోని రవీంద్ర భారతిలో అధికారికంగా నిర్వహిస్తున్న జయంతిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పండుగ సాయన్న, ఉత్సవ సమితి రాష్ట్ర కమిటీ సభ్యులు నరేంద్ర శివయ్య ముదిరాజ్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు బొజ్జ నారాయణ ముదిరాజ్,జిల్లా ఉపాధ్యక్షులుమండల రమేష్,బోథ్ మండల అధ్యక్షులు జూంగాల భోజన్న ముదిరాజ్,బొజ్జ సాయన్న,గొండ్ల భోజరాజు ముదిరాజ్ ,సున్నపు శ్రీనివాస్,జిట్టి రాజేశ్వర్ పాల్గొన్నారు.

# లోకేశ్వరంలో ప్రజావాణి కార్యక్రమం



ప్రజాపక్షం/లోకేశ్వరం : లోకేశ్వరం మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 9 మంది అధికారులచే ఎంపిడిఓ రామకృష్ణ సమక్షంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు.ఇందులో భాగంగా మండలంలోని రాజుర మరియు తదితర గ్రామాలలోని ఇందిరమ్మ భవనం మరియు అంగన్వాడీ నిర్మించడం లేదంటూ ఫిర్యాదు రావడం జరిగిందని పై అధికారులకు తెలిపి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్ సూర్యరావు,ఏపి ఎం బోజరం విద్యుత్ ఏ ఈ,తదితర అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలి: మాజీ ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** విజయదశమి, దసరా పండుగను పురస్కరించుకుని భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలకు, రైతులకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు, ఆనందాలు నింపాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే దసరా పండుగను ప్రజలందరూ కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలని కోరారు. రైతులకు పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజాసేవలో అంకితభావంతో ముందుకు సాగాలని, భూపాలపల్లి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆయన ఆకాంక్షించారు. విజయదశమి పర్వదినం ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యం, సిరిసంపదలను తీసుకురావాలని గండ్ర వెంకటరమణారెడ్డి కోరారు.

## మృతుల కుటుంబాలకు ఆరూరి పరామర్శ

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** వర్ధన్నపేట నియోజకవర్గ గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ పరిధిలోని పైడిపల్లి గ్రామ శాఖ మాజీ అధ్యక్షులు లింగం సాంబమూర్తి సతీమణి రమ ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను, అరెపల్లి గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ కాడబోయిన బిక్షపతి తల్లి ఎల్లమ్మ దశదినకర్మ కార్యక్రమానికి హాజరై వారి చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ పరామర్శించారు. వీరి వెంట మాజీ 3వ డివిజన్ అధ్యక్షులు నేరెళ్ల రాజు, మాజీ పీఏసిఎస్ చైర్మన్ ఇట్యాల హరికృష్ణ, సీనియర్ నాయకులు ఎల్లవుల కుమార్ యాదవ్, ఇట్యాల సతీష్, మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు మంతూర్తి కుమార్, రవీందర్, కుమార్, నర్సయ్య, సురేష్, సల్దన్, జన్ను సారంగం తదితరులు ఉన్నారు.

## మృతురాలి కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల పరామర్శ



**ప్రజాపక్షం/రాయపర్తి:** మండలంలోని జింకురాం తండా గ్రామ సర్పంచ్ గుగులోత్ సునీత శ్రీనివాస్ వదిన గుగులోత్ కవిత అనారోగ్యంతో మరణించగా ఆదివారం ఆమె పార్థివ దేహానికి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్య నాయక్ పూలమాలలు వేసి నివాళులు అర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఏఎంసి వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు పెండ్లి మహేందర్ రెడ్డి, దుబ్బ తండా గ్రామ సర్పంచ్ గోపాల్ నాయక్, పాల్గొన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**ప్రజాపక్షం/ నర్సంపేట :** ఇరవై ఏళ్ల క్రితం ఒకే తరగతి గదిలో కలిసి చదువుకున్న విద్యార్థులంతా మరోసారి ఒక్క చోట చేరి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నర్సంపేటలోని శ్రీనివాస ఆదర్శ ఉన్నత పాఠశాలకు చెందిన 2006 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం (రీయూనియన్) అక్టోబర్ 19న పాఠశాల ప్రాంగణంలో ఆత్మీయంగా నిర్వహించారు. చాపటర్ 2026 అనే థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమం స్నేహబంధాలకు, గురువుల పట్ల గౌరవానికి ప్రతీకగా నిలిచిందన్నారు. ఈ సమ్మేళనానికి పూర్వ విద్యార్థులతో పాటు వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం విద్యార్థులు తమ గురువులను ఆత్మీయంగా పలకరించి, వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, తమ జీవితాల్లో వారు పోషించిన పాత్రను కృతజ్ఞతతో గుర్తుచేసుకున్నారు. ఇరవై ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు తమ పాఠశాల రోజుల అనుభవాలను, తరగతి గదిలో జరిగిన సరదా సంఘటనలను, స్నేహితులతో పంచుకున్న మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు. 2006 బ్యాచ్ విద్యార్థులు ఇంతకుముందు 2010, 2016 సంవత్సరాల్లోనూ సమ్మేళనాలు నిర్వహించుకోగా, తాజా సమ్మేళనం వారి మూడో కలయికగా నిలిచింది. సీనియర్ ఉపాధ్యాయులను జూనియర్ ఉపాధ్యాయులు సన్మానించడం ఈ కార్యక్రమం అప్పటి ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# పోలీస్ కార్యాలయంలో ఆయుధ, వాహన పూజలు

### ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన ఎస్‌పి సిరిశెట్టి సంకీర్త్



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని భూపాలపల్లి జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆయుధ, వాహన పూజలను ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆధ్వర్యంలో ఆర్మ్డ్ రిజర్వ్ విభాగంలోని ఆయుధాలకు, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగంలోని పోలీస్ వాహనాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు, పోలీస్ సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు ఎస్పీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, విజయదశమి చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఈ పర్వదినం ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతిసౌభాగ్యాలను నింపాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని, పండుగను ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. జిల్లాలో ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణతోపాటు శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని ఎస్పీ తెలిపారు. నేరాల నియంత్రణ, ప్రజల భద్రత, అత్యవసర సమయాల్లో సత్వర సేవలందించడంలో పోలీస్ ఆయుధాలు, వాహనాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ప్రజల సహకారంతో జిల్లాలో శాంతిభద్రతలను పటిష్టంగా కొనసాగిస్తూ, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సమర్థవంతమైన సేవలు అందించేందుకు జిల్లా పోలీస్ శాఖ కట్టుబడి ఉందని ఎస్పీ స్పష్టం చేశారు.

# పేదల కోసం పోరాడిన మహనీయుడు పండుగ సాయన్న

### ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి నీలం దుర్గేశ్



**ప్రజాపక్షం/తొర్రూరు :** పేదల కోసం పోరాడిన మహనీయుడు పండుగ సాయన్న అని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి నీలం దుర్గేశ్ అన్నారు. డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దుర్గేశ్ మాట్లాడుతూ నవాబుకు కొమ్ముకాసే భూస్వాముల పెత్తందారితనానికి, దోపిడికి, అణచివేతకు, ప్రజల మీద చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు పండుగ సాయన్న అని అన్నారు. పెత్తందారులు, భూస్వాముల దౌర్జన్యాలు, దోపిడీలకు వ్యతిరేకంగా పోరాడి పేద ప్రజలకు అండగా నిలబడ్డారని కొనియాడారు. పండుగ సాయన్న చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 22న సాయన్న జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జరపడం అభినందనీయమన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు చిల్లా సహదేవ్, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల చీఫ్ ప్రమోటర్ కొత్తూరు రమేశ్, ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి అలువాల సోమయ్య, జిల్లా నాయకులు కొండ వెంకన్న, శీలం సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి చంద్రమూర్తి, మండల కార్యదర్శి పులి గుజ్జ మహేశ్, నాయకులు గువ్వ రాము పాల్గొన్నారు.

# రావణ దహనాన్ని నిలిపివేయాలి

### ఆదివాసి ప్రజా సంఘాలు జాయింట్ యాక్షన్ కమిటీ

**ప్రజాపక్షం/మంగపేట :** ములుగు జిల్లా మంగపేట మండలంలోని దసరా పండుగ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా రావణాసురుడి దిష్టిబొమ్మను దహనం చేయడం నిలిపివేయాలని ఆదివాసి ప్రజాసంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేస్తుంది ఆదివాసి గోండు సమాజంలో కొన్ని రాజ్యాలను పాలించిన ఆదివాసులను ఆదివాసి వీరులను రావణాసురుడు గోండు రాజులను రాక్షసులుగా చిత్రీకరించడం చాలా బాధాకరంగా ఉందని ఆదివాసి సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. రావణాసురుడు తమ దృష్టిలో రాక్షసుడు కాదని, గొప్ప రాజు, వీరుడు, మా ఆదివాసి పూర్వీకుడని మేము విశ్వసిస్తున్నాం. ఒక సమాజం ఆరాధించే వ్యక్తిని మరో సమాజం దుష్టుడిగా భావించే ఇతిహాస కథనాలు ఉన్నప్పుడు, భిన్నమైన సాంస్కృతిక విశ్వాసాలను గౌరవించాలని కోరుతు మంగళవారం దసరా పండుగ సందర్భంగా మంగపేట మండలంలో రావణ దహనానికి వ్యతిరేకంగా జరగబోయే నిరసన కార్యక్రమానికి మండలంలోని ఆదివాసులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆదివాసి ప్రజా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి ప్రజాసంఘాల నాయకులు ఎట్టి సారయ్య, దొర తాటి నాగరాజు, తోలేం సుధాకర్, తోలేం రామకృష్ణ, కొమరం రవి, కోరెం మొగిలి, జిగట శ్రీను, సోలం సాయిబాబు, పాయం వికాస్, గుమ్మడి సారయ్య, చందా రమేష్, తోలేం వెంకన్న, ఈసం కృష్ణ, అన్నెబోయిన నరేందర్, సున్నం మధు, పూనెం నరసయ్య పాల్గొన్నారు.

## జనగామ ప్రజలకు దసరా శుభాకాంక్షలు



**ప్రజాపక్షం /జనగామ :** జనగామ జిల్లా ప్రజలకు పలువురు దసరా శుభాకాంక్షలు తెలిపారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిలు వేరువేరుగా దసరా శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు దసరా పండగను ఎంతో సంతోషంగా చేసుకోవాలని, జమ్మి పూజలు చేయడంతో పాటు కుటుంబీకులు అంతా సంతోషంగా జరుపుకోవాలన్నారు. విజయ దశిమి అందరికి విజయాలు ప్రజాదించాలని వారు ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండడంతో పాటు జనగామ ప్రజలు ఎంతో సంతోషంగా ఉండాలన్నారు.

## ఆసరా కొత్త పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలి




**ప్రజాపక్షం /జనగామ :** ఆసరా కొత్త పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణ కమిటి సమావేశంలో సిపిఎం కార్యాలయంలో కళ్యాణం లింగం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జోగు ప్రకాష్ మాట్లాడుతూ నాలుగేళ్లుగా అనేక మంది ఆసరా పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ప్రభుత్వం కొత్తగా పింఛన్లు ఇస్తామని ప్రకటన చేసిందని ఆగస్టు 15 నుండి సెప్టెంబర్ 15 వరకు నెల రోజుల పాటు ధరఖాస్తులు స్వీకరించారన్నారు. 57 ఏళ్లు నిండినా పింఛన్లు రాకపోవడంతో అనేక మంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా పింఛన్లు ఇవ్వాలన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బూడిద గోపి, ఆజారుద్దీన్, బాల్న వెంకటమల్లయ్య, పల్లెర్ల లలిత, కళ్యాణి, పగిడిపల్లి బాలమణి, బొట్ల శ్రావన్, పాముశ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమడూరులో దుర్గామాత వద్ద మహా అన్నదానం

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** పెద్దమడూరులో శ్రీదుర్గా మాత ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శ్రీ దుర్గాదేవి హోమం, మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ ప్రజల సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు, లోక కళ్యాణం, విశ్వశాంతి కోసం ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు లక్ష్మి, ప్రసన్న రాజశేఖర్ గౌడ్, అఖిల రాజు, సంపత్, సందీప్, రమేష్, రాజు, అరవింద్, అభినవ్, రాజేష్, రాజేష్ కావ్య, రిషిక, కళ్యాణి, దీపిక, భవాని భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలు, భక్తులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## చండీ హోమం పూర్ణాహుతిలో పాల్గొన్న డిసిపి రాజమహేంద్ర నాయక్



**ప్రజాపక్షం/జనగామ టౌన్:** శ్రీఉప్పలమ్మ దేవీ ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీదేవి దుర్గాభవాని శరన్నవ రాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం చండీ హోమం, పూర్ణాహుతి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనగామ జిల్లా డీసీపీ రాజమహేంద్ర నాయక్ (ఐపీఎస్) హాజరై ప్రత్యేక పూజలలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పవన్ శర్మ, శ్రీ ఉప్పలమ్మ దేవాలయం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.